క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నాగోల్‌లో శ్రీలక్ష్మీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం గౌరెల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి రకరకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన ఔషధాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహ మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని, గ్రామీణులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చెంచల అశోక్, నాగరాజు, గ్యార భాస్కర్, వెంకటేశ్, నవీన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పోను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ వరప్రసాద్ తదితరులు

కడ్తాల్: ఈ నెల 19,20,21 తేదీల్లో నార్సింగ్‌లో నిర్వహించనున్న హైదరాబాద్ ఫొటో ఎక్స్‌పో కార్యక్రమానికి ఫొటో గ్రాఫర్లు తరలివచ్చి, జయప్రదం చేయాలని సంఘం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివలింగంగౌడ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఎక్స్‌పో వాల్‌పోస్టర్‌ను ఎస్‌ఐ వరప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జాల శ్రీశైలం, కార్యదర్శి బీష్మాచారి, కోశాధికారి కిరణ్‌కుమార్, రబ్బాని, మహేశ్, శివశంకర్, కృష్ణ, తరుణ్, నవీన్, సాయికుమార్, మహేశ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

అలైన్‌మెంట్ మార్చే వరకు ఉద్యమం


దీక్షకు సంఘీభావం తెలిపిన నాయకులు

కడ్తాల్: పంట పొలాల మీదుగా తీస్తున్న 765 కేవీ హైటెన్షన్ బీదర్– మహేశ్వరం అలైన్‌మెంట్‌ను మార్చే వరకు ఉద్యమం ఆపేది లేదని బాధిత రైతులు స్పష్టం చేశారు. అలైన్‌మెంట్ ఆపాలని డిమాండ్ చేస్తూ.. వారు చేపట్టిన నిరాహార దీక్ష ఆదివారానికి ఏడో రోజుకు చేరుకుంది. దీక్షకు వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. పేద రైతుల పొలాల మీదుగా హైటెన్షన్ లైన్ తీస్తే.. వారు నష్టపోతారని, వెంటనే బీదర్ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో రైతు సంఘం నాయకుడు రామకృష్ణ, నాయకులు లాయక్‌అలీ, రాజేందర్‌యాదవ్, మహేశ్, గౌరటి కృష్ణ, శ్రీరాములుగౌడ్, పర్వతాలు యాదవ్ ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


నూతన సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: కుర్మసంఘం ఎల్మినేడు గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం బీరప్ప ఆలయ ప్రాంగణంలో సంఘం పెద్దల సమక్షంలో పెద్దకుర్మగా కొట్టాముల మల్లేశ్, సెల్వోజీగా నిట్టు బాటయ్య, ఆలయ చైర్మన్‌గా అరిగే జంగయ్య, ఉపాధ్యక్షుడిగా గౌర బీరప్ప, కోశాధికారిగా చిట్టి శివకుమార్‌లను నియమించారు.

మహిళల భద్రత.. షీటీం బాధ్యత


పట్నం బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న షీటీం సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళ భద్రత.. షీటీం బాధ్యతని పట్నం షీటీం పోలీసులు తెలిపారు. ఆదివారం పట్నం బస్టాండ్‌లో వారు ప్రయాణికులతో మాట్లాడారు. పోకిరీలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నిరంతరం నిఘాతో ఆకతాయిల ఆట కట్టిస్తామని తెలిపారు. అతివలకు రక్షణ కల్పించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే.. 100 లేదా, షీటీం రాచకొండ 87126 62111కు డయల్ చేయాలని సూచించారు.

పన్నులు సరే.. పనులేవి?

ఇబ్రహీంపట్నంలోని పలు కాలనీలు కనీస రోడ్డు సౌకర్యానికి నోచుకోవడం లేదు. ఏళ్లు గడిచినా అవే మట్టిరోడ్లు. గుంతల మార్గాలు. పన్నులు మాత్రం పక్కగా వసూలు చేస్తున్న అధికారులు.. అధ్వానమైన అంతర్గత మార్గాలు, ప్రజా సమస్యల గురించి పట్టించుకోవడం లేదని పురప్రజలు ఆరోపిస్తున్నారు.

మట్టిరోడ్లకు మోక్షమెప్పుడు!
- వర్షాలు పడితే కాలినడకనా కష్టమే
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- అభివృద్ధికి నోచుకోని కాలనీలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


త్రిశక్తినగర్ కాలనీ రోడ్డు దుస్థితి


బృందావన్, త్రిశక్తి నగర్ కాలనీల రోడ్డు ఇలా

ఇబ్రహీంపట్నం: పురపాలిక సంఘంగా అప్‌గ్రేడ్ అయిన తరువాత పట్నం అభివృద్ధి చెందుతుందని భావించాము. కానీ అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని పలువురు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. 2013లో ఇబ్రహీంపట్నం నగర పంచాయతీగా ఆవిర్భవించింది. 2018లో మున్సిపాలిటీగా అవతరించింది. దీంతో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర సమస్యలు తొలగిపోతాయి. మౌలిక సదుపాయాలతో పాటు.. ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అనుకున్న వారికి నిరాశే మిగిలింది. గ్రామ పంచాయతీ కాలం నుంచి ఉన్న బృందావన్ కాలనీ, త్రిశక్తి నగర్, వ్యవసాయ మార్కెట్ వెనుకభాగంలోని కాలనీలు, సాయినగర్, వివేకానందనగర్, భాగ్యనగర్, న్యూ చైతన్య తదితర కాలనీల్లో నేటికీ మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి.

చినుకుపడితే చిత్తడి

రహదారులు అభివృద్ధి నోచుకోక కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చినుకు పడితే మట్టిరోడ్లపై కాలి నడకన వెళ్లలేని దుస్థితి. ఇక వాహనదారుల ఇక్కట్లు చెప్పలేనివి. డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో.. మురుగు నీరు మట్టిరోడ్లపై పారుతోంది. ప్రస్తుత సీజన్‌లో వర్షపు నీరు తోడై.. ఇళ్లమధ్యే నిలుస్తోంది. గుంతలు, లోతట్టు ప్రాంతాల్లో నిలిచి మురికి కూపంగా మారుతోంది. తద్వారా దోమలు, ఈగలు పెరిగి స్థానికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది.

దండిగా ఆదాయం

ప్రస్తుతం సమస్యలు ఎదుర్కొంటున్న కాలనీల్లో కొత్తగా ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారు.. పర్మిషన్, బెటర్‌మెంట్ ఛార్జీల రూపంలో వివిధ రకాల పన్నులను మున్సిపాలిటీకి భారీగానే చెల్లిస్తున్నారు. పన్నుల రూపంలో, కొత్తగా వెలసిన కాలనీల నుంచి పలు రకాలుగా పురపాలికకు ఆదాయం దండిగా సమకూరుతోంది. కానీ ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పించడంలో మున్సిపాలిటీ యంత్రాంగం విఫలమవుతోంది. కనీసం రవాణా మార్గాన్ని అభివృద్ధి చేయడం లేదని ఆయా కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

పంచాయతీగా ఉన్నప్పుడు..

గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు సర్పంచ్‌లు, వార్డు సభ్యులు నయానో, భయానో తిరిగి సమస్యలను తెలుసుకునేవారు. మున్సిపాలిటీగా మారిన తర్వాత రాజకీయ పార్టీల అభ్యర్థులుగా ఎన్నికల్లో పోటీ చేస్తుండటంతో.. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని ప్రజలు పేర్కొంటున్నారు. ఎన్నికలు వస్తేనే బస్తీలు, కాలనీలు వారికి గుర్తుకు వస్తున్నాయని, ఆ తర్వాత ఎవరూ కనిపించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు.. డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దినదిన గండం



గుంతలు, మట్టి రోడ్లతో దినదిన గండంగా గడుస్తోంది. సమస్య గురించి పలుమార్లు అధికారులకు విన్నవించాం. అయినా ఫలితం శూన్యం. 15 ఏళ్ల క్రితం ఇల్లు నిర్మించుకున్నాం. నాటి నుంచి ఇదే దుస్థితి. నిత్యం దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్నాం. మున్సిపాలిటీగా మారితే మార్పు వస్తుందని మురిసిపోయాం. కానీ పరిస్థితిలో మార్పులేదు.

– పాండు రంగం, ఉపాధ్యాయుడు, త్రిశక్తినగర్

సౌకర్యాలు అడిగితే..



కొన్నేళ్ల క్రితం వెలిసిన కాలనీల్లో అభివృద్ధి కుంటుపడింది. ఇంటి పన్ను వసూలుకు నిర్ణీత గడువు రాక ముందే.. రిజిస్టర్లతో మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ వస్తారు. పన్ను చెల్లించాలని మొండిగా వ్యవహరిస్తారు. కానీ సౌకర్యాల గురించి అడిగితే మౌనమే సమాధానంగా వస్తోంది. సౌకర్యాలు కల్పించే బాధ్యత మున్సిపాలిటీ అధికారులదే. గుర్తించాలి.

– మహేందర్, బీజేపీ పుర అధ్యక్షుడు

రూ.30 కోట్లకు ప్రతిపాదనలు



కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. నిధుల లేమితో సీసీరోడ్లు వేయలేక పోతున్నాం. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవతో వాటి నిర్మాణానికి హెచ్‌ఎండీఏకు రూ.30 కోట్లకు ప్రపోజల్స్ పంపాం. అనంతరం ఆ అధికారులు పలు కాలనీలను పరిశీలించారు. నిధుల విడుదల తర్వాత కొత్త, పాత కాలనీల అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తాం. దశలవారీగా మట్టి రోడ్లను సీసీలుగా మార్చుతాం.

– సత్యనారాయణరెడ్డి, కమిషనర్, ఇబ్రహీంపట్నం

రజాకార్లపై తిరగబడ్డ రైతుబిడ్డలు

వారి ప్రాణత్యాగమే నిరంకుశ పాలనకు విముక్తి: సీపీఐ


జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు


హయత్‌నగర్: కుత్బుల్లాపూర్‌లో..

తుర్కయంజాల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది రైతులు ప్రాణత్యాగం చేశారు. వారి పోరాట ఫలితంగానే రజాకార్ల ఆగడాలు అంతమయ్యాయని సీపీఐ రాష్ట్ర నాయకుడు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తుర్కయంజాల్, బ్రాహ్మణపల్లి, కొహెడలో సీపీఐ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'బాంచన్ దొర నీ కాళ్లు మొక్కుతా అన్న నోటి నుంచి.. దొర ఏందిరో దొర పోకడేందిరో' అని యావత్ తెలంగాణ ప్రజల్లో చైతన్యం నింపిన గొప్ప పోరాటం అని గుర్తు చేశారు. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కల్పించడంతో పాటు 10 లక్షలకు పైగా ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టులదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అజ్మీర నర్సింగ్, జగన్ మోహన్ రెడ్డి, నరేందర్ గౌడ్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల్లో కీలక భూమిక

హయత్‌నగర్: నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసి, దేశంలో తెలంగాణను విలీనం చేయడంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్‌లో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ విమోచనం కోసం ఎందరో కామ్రేడ్లు ప్రాణత్యాగం చేశారని, మరెందరో ఆస్తులు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. వారి త్యాగాలను స్మరించుకోవడానికి వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విమోచన పోరాటంతో పాటు మలిదశ రాష్ట్ర సాధన ఉద్యమంలో పార్టీ పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అజ్మీరా హరిసింగ్ నాయక్, డి.వేణుగోపాలచారి, పొన్నాల యాదగిరి, బాల్‌రెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో బాలికల సత్తా


ప్రశంసా పత్రాలతో విద్యార్థినులు

ఇబ్రహీంపట్నం రూరల్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పట్నం విద్యార్థినులు సత్తా చాటారాని కోచ్ మంకాల అశోక్ కుమార్ తెలిపారు. నగరంలోని సాగర్‌రింగ్‌రోడ్డు సమీపాన కేకే గార్డెన్స్‌లో ఆదివారం అకిడో కరాటే ఛాంపియన్ షిప్ 2025 పేరుతో నిర్వహించారు. పోటీల్లో పట్నం నియోజకవర్గ పరిధి పాఠశాలల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు. అరుట్ల పాఠశాలకు చెందిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నుంచి ద్వితీయ స్థానంలో 5, తృతీయంలో 4, ఉన్నత పాఠశాల నుంచి మొదటి స్థానంలో 3, మోడల్ స్కూల్ 2, ప్రైమరీ 2, ఇబ్రహీంపట్నం 2, యాచారం జోవిల్ స్కూల్ తొలిస్థానం 1, ద్వితీయంగా 2, తృతీయంగా 4, రామోజీ ఉన్నత పాఠశాలలో ద్వితీయ స్థానంలో 8 మంది ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా విజేతలను శాలువాలతో సన్మానించారు. ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయండి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వేముల వీరేశంను ఆ సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. సరూర్‌నగర్ సర్కిల్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, సెక్రటరీ రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్, ఇబ్రహీంపట్నం డివిజన్ సెక్రటరీ నటరాజ్ పాల్గొన్నారు.

బోధన రుసుం చెల్లించాలి

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శివ కుమార్ గౌడ్



తుర్కయంజాల్: బోధన రుసుం, ఉపకార వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.శివ కుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ), ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇనిస్టిట్యూషన్స్(ఫతి), వృత్తి విద్య కళాశాలలు చేపడుతున్న బంద్‌కు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఏటా 12.50 లక్షల మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో విద్యను అభ్యసిస్తున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాలలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉన్నత విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, దసరా పండుగ లోపు బకాయి చెల్లించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

దాడులతో వాస్తవాలు దాచలేరు

కందుకూరు: పత్రికా స్వేచ్ఛను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాలరాస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నిజాన్ని నిర్భయంగా రాస్తున్న 'సాక్షి' దినపత్రికపై ఆ సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పాత్రికేయులపై దాడి.. ప్రజల హక్కులను హరించడమేనన్నారు. దాడులతో వాస్తవాలను దాచలేరని, ఇలాంటివి పునరావృతం కాకుండా.. కూటమి ప్రభుత్వం చూసుకోవాలని హితవు పలికారు.

చదువుతో పాటు క్రీడలు..

తుక్కుగూడ: స్కేటింగ్‌తో చిన్నారుల్లో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. ఆదివారం తుక్కుగూడ పుర కేంద్రంలో జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నారులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనన్నారు. ఆసక్తి ఉన్న క్రీడారంగంలో వారిని ప్రోత్సహించాలని సూచించారు. తుక్కుగూడలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి సందడి మొదలు

అబ్దుల్లాపూర్‌మెట్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే దేవీ నవరాత్రి ఉత్సవాల సందడి మొదలైంది. గౌరెల్లి గ్రామంలోని బస్టాప్ వద్ద ఆదివారం ఉదయం జై భవాని వీర శివాజీ బృందం ఆధ్వర్యంలో మండపానికి కర్ర పూజ చేశారు. టీం సభ్యులందరూ పాల్గొని శాస్త్రోక్తంగా క్రతువును నిర్వహించారు. కార్యక్రమానికి నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆమనగల్లు: ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం తలకొండపల్లి మండల నూతన కార్యవర్గాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు శివలింగంగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేశ్, ప్రధాన కార్యదర్శిగా కాలె శేఖర్, కోశాధికారిగా ఆంజనేయులును నియమించారు. నూతన సభ్యులను సన్మానించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించిన ముస్లింలు

కోలాహలంగా ర్యాలీలు



ఆమనగల్లు: మిలాద్ ఉన్ నబి వేడుకలు (మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును) ఆదివారం ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు మసూం ఆధ్వర్యంలో శ్రీశైలం– హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐ జానకీరాం రెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్, మెడికల్ షాప్ అసోసియేషన్ నాయకుడు పాపిశెట్టి రాములుతో కలిసి మసూ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'నారె తక్బీర్ అల్లాహ అక్బర్' అని నినదిస్తూ బైక్ ర్యాలీలు తీశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు గౌస్ మొయినుద్దీన్, జబ్బార్, సయ్యద్ ఖలీల్, రజాక్, జలాల్, అఫ్జల్, ఎం.ఎ.పాషా, నయూమ్, అజహర్, నూర్ ముస్తఫా నవ్ జవాన్ కమిటీ సభ్యులు అహ్మద్, అసద్, అఫ్రోజ్, గౌస్, ఫిర్దోస్, ఫహాద్, అఫ్రిది, అక్బర్, ఇమ్రాన్, సోహెబ్, సోహెల్ పాల్గొన్నారు.

అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం

ఆమనగల్లు: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. తలకొండపల్లి మండలం వెల్జాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన బాల్య మిత్రులు.. 25 ఏళ్ల తరువాత పాఠశాల వేదికగా సందడి చేశారు. చిననాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆటపాటలతో కేరింతలు కొట్టారు. అనంతరం నాడు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు శ్యాంసుందర్‌రావ్, బ్రహ్మచారి, ఖాజా ఆరిఫొద్దీన్, నర్సింహ, వెంకట్రాములుగౌడ్, అంజయ్య, శ్రీనివాస్‌లును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు, ఆరిఫ్, శశికుమార్, జనార్దన్‌రెడ్డి, శ్రీను, బహుగుణరెడ్డి, మైనొద్దీన్, సుదర్శన్, శ్రీను, రాంచందర్, వరలక్ష్మి, మంజుల, స్వాతి, రమాదేవి, సాయిలక్ష్మి, జ్యోతి, భాగ్య, అఫ్సర, సుల్తానా, అస్రబేగం, గీత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నలుగురితోనే..


ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయం

మున్సిపాలిటీలో సిబ్బంది కొరత
- రెగ్యులర్ అధికారులు నిల్..
- కీలక పోస్టుల్లో ఇన్‌చార్జిలే దిక్కు
- మందగించిన కార్యకలాపాలు
- ఇబ్బంది పడుతున్న పుర ప్రజలు

ఆమనగల్లు: పురపాలిక సంఘం కార్యాలయం సిబ్బంది లేమితో వెలవెలబోతోంది. 23 మంది విధులు నిర్వహించాల్సి ఉండగా.. ప్రస్తుతం కమిషనర్ శంకర్‌తో కలిపి నలుగురే పనిచేస్తున్నారు. నిన్నమొన్నటి వరకు 19 మంది రెగ్యులర్ పోస్టుల్లో పనిచేయగా.. వారం రోజుల క్రితం వార్డు ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న సత్యనారాయణ, దామోదర్, ఎల్లయ్య, శంకర్, సురేందర్, రమేశ్, సంతోష, హేమలత, గౌతమి, భాగ్యలక్ష్మి, ఫాతిమాలను రిలీవ్ చేశారు. ప్రస్తుతం నలుగురే మిగిలారు. కాగా ఔట్‌సోర్సింగ్‌లో పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్స్, ఆపరేటర్స్, వాటర్‌మెన్‌లు 73 మంది పనిచేస్తున్నారు.

వారు వారానికి ఒక్కసారే..

మున్సిపాలిటీలో కీలకమైన ఏఈ, టౌన్‌ప్లానింగ్ పోస్టుల్లో కొన్నేళ్లుగా ఇన్‌చార్జీలే కొనసాగుతున్నారు. వారు వారానికి ఒకసారి మాత్రమే కార్యాలయానికి వస్తున్నట్లు సమాచారం. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో ఏఈగా పనిచేస్తున్న శ్రీనివాసులు, ఆదిబట్ల, వడ్డెపల్లిలో పనిచేసే టీపీఓ వరప్రసాద్‌లు ఇన్‌చార్జీలుగా కొనసాగుతున్నారు. అలాగే కీలకమైన మేనేజర్ పోస్టులో పనిచేస్తున్న సతీష్.. ఘట్‌కేసర్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

అభివృద్ధికి విఘాతం

మున్సిపాలిటీలో సిబ్బంది కొరత కారణంగా అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు కేటాయింపులో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇదిలా ఉండగా.. సిబ్బంది లేమితో అభివృద్ధి పనుల్లో అలసత్వం కనిపిస్తోందని, సేవలు అందడం లేదని పురప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే తగిన సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

ఏడేళ్ల క్రితం..

మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ఆమనగల్లును గత ప్రభుత్వం ఏడేళ్ల క్రితం విఠాయిపల్లి గ్రామాన్ని విలీనం చేసి పురపాలిక కేంద్రంగా ఏర్పాటు చేసింది. ప్రస్తుతం మున్సిపాలిటీలో.. సుమారు 26 వేల జనాభ ఉండగా.. అందులో 15వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. అప్‌గ్రేడ్ అనంతరం ఒక పాలకవర్గం పదవీకాలం పూర్తి చేసుకుంది.